సాక్షి పల్నాడు

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024




స్వామివారికి పుష్పయాగం

తెనాలిటౌన్: వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి తెనాలి తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు.



సాతులూరులో వసంతోత్సవం

నాదెండ్ల: సాతులూరులో గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.80 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,788 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పులిచింతల నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదు

పిడుగురాళ్ల: పులిచింతల పునరావాస కేంద్రాల్లోని వారికి రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కోసం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని, ప్రజలు సద్వినియోగించుకోవాలని పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కె.శ్రీరాములు, పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ ఏ.టీ.రాజ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లోని పులిచింతల పునరావాస క్రేంద్రాలకు చెందిన నిర్వాసితులు వారి నివాసాలకు సంబంధించిన స్థలాలను, గృహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ దస్తావేజులకు సంబంధించి ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని, మధ్యవర్తులు, దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, సందేహాలు ఉంటే నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని పులిచింతల నిర్వాసితులందరూ సద్వినియోగించుకోవాలని కోరారు.

యార్డుకు 98,671 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 98,671 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,652 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,882 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నేడు 'చలో అసెంబ్లీ'కి అనుమతి లేదు

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సమస్యల పరిష్కారానికి మంగళవారం తలపెట్టిన 'చలో అసెంబ్లీ'కి ఎటువంటి అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని ఆసరా చేసుకుని, కొన్ని అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా అనుమతుల్లేవని స్పష్టంచేశారు. తుళ్లూరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ చట్టం అమల్లో ఉందని తెలిపారు. ఎవరైనా పోలీసుల ఆదేశాలను విస్మరించి, హాజరైతే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెప్పారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చాలా ఏళ్లుగా ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యే రైల్వేబోర్డు చైర్‌పర్సన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సోమవారం ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, కేశినేని శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జగయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుమారుడు ప్రసాద్ రైల్వేబోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హాకు వినతిపత్రం ఇచ్చారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ–గుడివాడ, విజయవాడ నార్త్ క్యాబిన్–గుండాల స్టేషన్–బల్బ్ క్యాబిన్‌ల మధ్య రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, విజయవాడ–హౌరా రైల్వేట్రాక్ పనులు సత్వరమే పూర్తిచేయాలని కోరారు. సింగ్‌నగర్–రామకృష్ణాపురం–విజయవాడ–హౌరా రైల్వేట్రాక్ ఆర్‌యూబీ మధ్య పెరిగిన వాహనరద్దీకి అనుగుణంగా అదనంగా బాక్స్ వెంట్‌ల ఏర్పాటు పనులు పూర్తిచేయాలన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4600, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5300 వరకు పలికింది.

దేశం చూపు మన వైపు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స
- కాకాని జేఎన్‌టీయూఎన్ కళాశాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



కాకాని జేఎన్‌టీయూ కళాశాలలో అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు బొత్స, కారుమూరి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేటరూరల్: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు కారణంగా దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. కాకానిలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.50కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బొత్సతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జేఎన్‌టీయుకే వైస్‌ఛాన్స్‌లర్ జీవీఆర్ ప్రసాదరాజులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి బొత్స మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యాశాఖలో సంస్కరణలు తీసుకువచ్చి అక్షరాస్యతలో మొదటి స్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులు గౌరవంగా తమ లక్ష్యాలను చేరుకునే విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి ఇంగ్లీష్ మీడియంతోపాటు ట్రోఫిల్ తీసుకువచ్చినట్టు తెలిపారు. ఐబీతో ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్రంలోని 45వేల ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని వివరించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి ఇటువంటి కార్యక్రమాలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల దోహదపడుతుందన్నారు. ఈ కళాశాలకు భూమి లభ్యత ఎక్కువగా ఉందని, యూనివర్సిటీగా కళాశాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. విద్యాశాఖలో వినూత్నమైన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు విద్యాకానుకలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటుచేసి ప్రైవేటు పాఠశాలలకు మించిన స్థాయిలో అందిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి, పట్టుదల వలనే అక్షరాస్యతలో రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ 2014లోనే కళాశాల మంజూరైనా గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వంతో సంబంధం లేకుండా వర్సిటీ నిధులు ఖర్చుచేసే అవకాశం ఉన్నా కమీషన్ల కోసం నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రూ.150కోట్లతో నిర్మాణాలు చేపట్టామన్నారు. రెండు నెలల్లో బాలురు, బాలికల వసతి గృహాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. భవిష్యత్‌లో వర్సిటీగా ఏర్పడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు క్యాంపస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ఎన్ఈసీ కళాశాల అధినేత మిట్టపల్లి కోటేశ్వరరావు, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, వర్సిటీ రేక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఛీఫ్ ఇంజినీర్ వి.శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్ బాబు, జెడ్పీటీసీ సభ్యులు పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ నిర్ణయం అద్భుతం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యంత ప్రయోజనం కల్పిస్తూ వారి ప్రయోజనం కోసం ఎన్నో రకాలుగా కృషి చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేయటంలో ముందంజలో ఉంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ చేయని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే సీఎం జగన్ ఇప్పటికే ప్రకటించిన సీట్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఏ పార్టీ కూడా టికెట్ ఇవ్వలేదన్నారు. అందుకు భిన్నంగా సీఎం జగన్ బీసీలలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి పి అనిల్‌కుమార్ యాదవ్‌కు టికెట్ కేటాయించటం సంతోషకరమన్నారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకునే ధైర్యం సీఎం జగన్‌కు తప్ప ఏ నాయకుడికి లేదన్నారు.



సున్నపురాయి క్వారీలు

కూలీలే యజమానులు

వారంతా ఆయా క్వారీలు, ముగ్గుమిల్లుల్లో రోజుకూలికి పనిచేసే కూలీలు. రోజంతా కాయకష్టం చేసుకుని సాయంత్రానికి కూలి తీసుకొని వెళితేగానీ ఇంట్లో వాళ్ల నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లలేని పరిస్థితి.. ప్రభుత్వ ప్రోత్సాహంతో పూట గడిస్తే చాలు అనే పరిస్థితి నుంచి తాము కలలోనైనా ఊహించలేని స్థాయికి వారు ఎదిగి, క్వారీలకు యజమానులు కాగలిగారు.

- క్వారీలు, మిల్లులకు యజమానులైన కూలీలు, బడుగులు
- పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందుతున్న వైనం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో రాణిస్తున్న ఎస్సీ, బీసీ వర్గాలవారు

దాచేపల్లి: గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసుకునే కూలీలకే ఉపాధి లేక వలసబాట పట్టాల్సిన దుస్థితి. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూలీలకు చేతినిండా పని కల్పించటంతో పాటుగా యజమానులను చేశారు. గురజాల నియోజకవర్గం పరిధిలో సున్నపురాయి క్వారీలకు.. చిప్స్ అండ్ ఫల్వరైజ్డ్ పరిశ్రమలకు కూలీలను, బలహీనవర్గాలకు చెందిన ప్రజలను యజమానులు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అత్యధికంగా సున్నపురాయి క్వారీలకు లీజులను తెప్పించటం.. కొత్తగా పరిశ్రమలను స్థాపించటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అక్కడ అక్రమ మైనింగ్ జరగకుండా ఉక్కుపాదం మోపింది. గత టీడీపీ ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ జరిగిన నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు కావటంతో పరిశ్రమలు మూతపడటం, క్వారీలను సీజ్ చేయటంతో కూలీలకు ఉపాధిలేక వలసబాట పట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం ఎనిమిది సున్నపురాయి క్వారీలకు లీజులు ఉండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 67 కొత్త లీజులు తెప్పించారు. లీజులు పొందిన వారిలో వడ్డెర్లు, ఎస్సీలు అధికంగా ఉన్నారు. వీరంతా క్వారీల్లో పనులు చేసుకుని జీవనం సాగించేవారే. ప్రభుత్వపరంగా అన్నిరకాల అనుమతులు ఇప్పించేందుకు ఎమ్మెల్యే కాసు ప్రత్యేకంగా కృషి చేశారు. దాచేపల్లి నగర పంచాయతీలోని పారిశ్రామిక వాడలో కొత్తగా 15కి పైగా చిప్స్, ఫల్వరైజ్డ్ మిల్లులు కట్టారు. మిల్లుల్లో పనిచేసే కార్మికులే ప్రభుత్వ ప్రోత్సాహంతో మిల్లులు కట్టుకున్నారు. మిల్లులు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45శాతం సబ్సిడీని, ఇతరులకు 20శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించి ప్రోత్సహించింది. సున్నపురాయి క్వారీల్లో తీసిన తెల్లరాయిని మిల్లులకు తీసుకువచ్చి పౌడర్‌గా తయారు చేసి చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకి ఎగుమతి చేస్తుంటారు. క్వారీలు, మిల్లుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

ప్రభుత్వానికి పెరిగిన ఆదాయం..

సున్నపురాయి క్వారీలకు అనుమతులు మంజూరు చేయటంతో ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరిగింది. భూగర్భ, గనులశాఖ ద్వారా రాయల్టీ రూపంలో ఆదాయం సమకూరింది. ఏడాదికి సగటున రూ.25కోట్ల మేర ఆదాయం వస్తుంది. అక్రమ మైనింగ్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించటంతో అధికారులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. సున్నపురాయి క్వారీలకు, చిప్స్ అండ్ ఫల్వరైజ్డ్ మిల్లుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండటంతో స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం యజమానిని చేసింది..



చదువు పూర్తి అయిన తరువాత ఉద్యోగం రాలేదు. చిప్స్, ఫల్వరైజ్డ్ మిల్లు కడితే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలుసుకున్నాం. నాతో పాటుగా స్నేహితులు, మరి కొంతమంది దగ్గర డబ్బులు, బ్యాంక్ రుణం తీసుకుని మిల్లు కట్టాం. మిల్లులో ఉత్పత్తి బాగానే వస్తుంది. సబ్సిడీ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాం. నేను పెట్టిన పెట్టుబడిలో 45శాతం వరకు సబ్సిడీ వస్తుందని భావిస్తున్నాను. నిరుపేద కుటుంబానికి చెందిన నేను నిరుద్యోగిగా ఉండటంతో కేవలం ప్రభుత్వ ప్రోత్సాహాలు తెలుసుకుని మిల్లు కట్టుకున్నాం. నా లాంటి వారికి ఈ ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.

– వేల్పుల కిషోర్, చిప్స్, ఫల్వరైజ్డ్ మిల్లు యజమాని

ఇద్దరు పిల్లల ఉసురు తీసిన

భార్య భర్తల గొడవ

- టీలో ఎలుకల మందు కలిపి భర్త, ముగ్గురు పిల్లలతోపాటు తానూ తాగిన మహిళ
- తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రుల్లో చేరిక
- మిగిలిన ముగ్గురి పరిస్థితి విషమం
- పల్నాడు జిల్లాలో దారుణం



మృతిచెందిన ఈశ్వర్, భానుప్రకాష్ (ఫైల్)

విజయపురిసౌత్ : భార్యాభర్తల మధ్య వివాదం ఇద్దరు పిల్లల ఉసురుతీయడంతో పాటు.. ప్రాణాపాయస్థితిలో మరో ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం నారాయణరెడ్డి పురం తండాలో చోటుచేసుకుంది. విజయపురిసౌత్ ఎస్‌ఐ పి. వెంకటకొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు..

నారాయణరెడ్డి పురం తండాకు చెందిన రమావత్ రవినాయక్‌కు భార్య వసంత, కుమారులు రమావత్ భానుప్రకాష్, కార్తీక్ ప్రకాష్, కవలలు ఈశ్వర్, ఉమేశ్వర్ ఉన్నారు. వీరిలో కార్తీక్ ప్రకాష్ నల్గొండ జిల్లా దామర్లచర్ల మండలం నరసాపురంలో అమ్మమ్మ దగ్గర ఉంటున్నాడు. రవినాయక్ హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజులకు ఒకసారి గ్రామంలో ఉన్న భార్య వసంత, పిల్లల వద్దకు వచ్చి వెళ్తా ఉండేవాడు. రెండు రోజుల కిందట రవినాయక్ తండాలోని కుంటుంబసభ్యుల వద్దకు వచ్చాడు. ఆదివారం ఉదయం భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వసంత టీలో ఎలుకల మందు కలిపి భర్త రవినాయక్, ముగ్గురు కుమారులు భానుప్రకాష్, ఈశ్వర్, ఉమేశ్వర్‌కు తాగించి తాను కూడా తాగింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాంతులు అవుతుండడంతో కుటుంబ సభ్యులందరినీ మాచర్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా రెండున్నర సంవత్సరాల వయస్సున్న ఈశ్వర్ చనిపోయాడు. రవినాయక్‌ను నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా భానుప్రకాష్, ఉమేశ్వర్‌కు శ్రీకేర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. భానుప్రకాష్ (12) పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలోని మిర్యాలగూడలో మృతి చెందాడు. వసంతను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈశ్వర్, భానుప్రకాష్ మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకట కొండారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి వరకు కులగణన నమోదు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్రవ్యాప్తంగా గత నెల 19 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న కుల గణన వివరాలు బుధవారం సాయంత్రంలోపు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలో 568 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటి వరకు 6,45,226 కుటుంబాల సర్వే పూర్తి చేశామన్నారు. పలు కారణాలతో ఇప్పటికీ నమోదు చేసుకోని వారు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నికల్లో సాంకేతిక సైన్యం

- ఐటీ సేవల విస్తృత వినియోగం
- అవగాహన కల్పించేందుకు కసరత్తు
- శిక్షణ పూర్తితో మాస్టర్ ట్రైనర్లు సిద్ధం



సీ-విజిల్ యాప్

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీకి ఈసారి సాంకేతిక సేవలను (ఐటీ) సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. సువిధ, సీ–విజిల్, అబ్జర్వర్ పోర్టల్, పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తోంది. ఓటర్లు కూడా సమర్థంగా వినియోగించుకునేలా ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి చిలకలూరిపేట ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ) వసంతబాబు, తహసీల్దార్లు (ఏఈఆర్వో) జి.శ్రీనివాస్(కారంపూడి), కెఎస్.చక్రవర్తి (పిడుగురాళ్ల), బి.కిరణ్‌కుమార్(వినుకొండ), కె.నగేష్(నకరికల్లు), ఎంపీడీఓలు నరసింహారావు (పెదకూరపాడు), ఆర్‌ఈవీ.ఫణికుమార్(గురజాల), జి.శ్రీనివాసరెడ్డి(కారంపూడి), జీవీ సత్యనారాయణ(సత్తెనపల్లి)లను జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వీరికి విజయవాడలో ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణపై మరికొందరు సిబ్బందికి కూడా ఓట్ల లెక్కింపు, నోడల్, అకౌంటింగ్ బృందం, ఐటీ, వెబ్ కాస్టింగ్‌పై శిక్షణ ఇచ్చేలా అవగాహన కల్పించారు. పోస్టల్ బ్యాలెట్‌ల సంసిద్ధత, ఆ ప్రక్రియ లెక్కింపు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వాటిపైనా శిక్షణ ఇచ్చారు. ఈ మాస్టర్ ట్రైనర్లు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు నియమించిన ఇతరులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కాగా సాధారణ బదిలీల్లో భాగంగా వీరిలో ఎక్కువ మంది ఇప్పటికే బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో మరో విడత జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లను నియమించి వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లోనే అనుమతులు

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయపార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార వ్యవహారాలకు సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు. వీటి కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని ఉండదు.

సత్వరం ప్రలోభాల కట్టడికి

ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం, ఇతర ప్రలోభాలకు గురిచేసి లబ్ధి పొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు సీ–విజిల్ యాప్ అందుబాటులోకి తెచ్చారు. అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, లొకేషన్‌ను ఈ యాప్‌లో పొందుపరిస్తే .. ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. షెడ్యూలు వచ్చిన నాటి నుంచి వినియోగించనున్నారు.

త్వరగా ఆదేశాల అమలుకు

ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చే ఆదేశాలు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి వేగంగా చేరేలా అబ్జర్వర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఈ పోర్టల్ పనిచేస్తుంది.

ఓటర్లు సమాచారం తెలుసుకునేలా...

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఓటు ఉందా ... లేదా? ఏ పోలింగ్ కేంద్రాల్లో ఉంది. బీఎల్‌ఓ ఎవరు ... ఎపిక్ కార్డు సంఖ్య, పోలింగ్ కేంద్రం ఏ ప్రాంతంలో ఉంది. ఇలా ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునే ఏర్పాట్లు చేయనున్నారు.


తలనీలాల టెండర్ మరో సారి వాయిదా

ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ మరోమారు వాయిదా పడింది. ఇంద్రకీలాద్రిపై మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు నిర్వహించారు. ఆలయ ఏఈఓలు చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, జంగం శ్రీనివాసరావు పర్యవేక్షణలో టెండర్ పక్రియను నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడుకు చెందిన మొత్తం 15 మంది కాంట్రాక్టర్లు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం తమ పాటను రూ.9కోట్లుగా నిర్ణయించి బహిరంగ వేలాన్ని ప్రారంభించింది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పాటను రూ.7 కోట్లకు తగ్గించారు. కాంట్రాక్టర్లు పాటను పెంచేందుకు ఆసక్తి చూపకపోవడంతో అధికారులు సీల్డ్ టెండర్ల బాక్స్‌ను తెరిచారు. మొత్తం ఏడు టెండర్ షెడ్యూల్స్‌ను విక్రయించగా, అందులో ఐదు టెండర్లు మాత్రమే సీల్డ్ బాక్స్‌లోకి వచ్చాయి. సీల్డ్ టెండర్లను తెరిచిన అధికారులకు సీల్డ్ టెండర్ రూ.5.04 కోట్లకు దాఖలు చేశారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి

- ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ
- కలెక్టరేట్ స్పందనలో 120 అర్జీలు స్వీకరణ



కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, అధికారులు

నరసరావుపేట: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ కేఆర్. కల్పశ్రీ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు చెందిన 120 అర్జీలు అందజేశారు. అర్జీలను ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏ ముని స్వీకరించారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రెడ్ క్రాస్ సొసైటీ ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసింది.

విద్యుత్ సదుపాయం ఇవ్వండి

కొన్నేళ్లుగా నేను సుమారు 100కుపైగా వట్టిపోయిన ఆవులకు అడవిలో ఆశ్రయం కల్పించా. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగగా మూడెకరాల భూమి ఇచ్చారు. అయితే దానికి ఎటువంటి పత్రాలు ఇవ్వలేదు. అందువలన ఆ భూమికి డీకే పట్టా ఇచ్చి, ఆవులు పెంచేందుకు కావాల్సిన విద్యుత్ సదుపాయం ఇవ్వాలి.

–పసుపులేటి పిచ్చయ్య, దాచేపల్లి

పంట కాలువలు పునరుద్ధరించండి

పట్టణానికి చుట్టు పక్కల చాలామంది రియల్టర్లు పంట కాలువలను పూడ్చేసి వాటిని కలుపుకొని వెంచర్లు వేశారు. వాటిని విక్రయిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కాలువలను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోండి. అపరాధ రుసుం వసూలు చేయండి. కట్టిన గోడలను కూల్చేయండి.

–షేక్ కరీముల్లా, ఎంఐఎం జిల్లా కార్యదర్శి

నరసరావుపేట ఆర్డీఓగా సరోజని



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా పి.సరోజని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో ఆమె చీరాల నుంచి నరసరావుపేట వచ్చారు. కాగా, ఇక్కడ పనిచేసిన ఎం.శేషిరెడ్డి కర్నూలు ఆర్డీఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సరోజనిని ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

మాయ మాటలకు మారుపేరు చంద్రబాబు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



దుర్గిలో ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

దుర్గి: మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు మాయ మాటలతో మోసగించిన వ్యక్తి చంద్రబాబు నాయుడే అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సోమవారం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు పూర్తి రుణమాఫీ చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. పవన్ కల్యాణ్, షర్మిలను ప్రోత్సహిస్తూ సీఎం వైఎస్ జగన్‌పై నిరాధారమైన ఆరోపణలు చేయిస్తోంది చంద్రబాబే అని పీఆర్కే ఆరోపించారు. క్లిష్ట పరిస్థితిలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుండి నడిపించింది సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఏఎంసీ చైర్మన్ వి.గోపాల్, ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు ఊరిబిండి ఏగయ్య, చల్లా శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యూత్ విభాగం కన్వీనర్ వై.బుచ్చిబాబు, పీఏసీఎస్ చైర్మన్ కె.రామారావు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వెంకటయ్య, సర్పంచి ఆర్.మాణిక్యం, ఎంపీటీసీలు కె.గోపాల్, సీతా గోవింద్, చింతా నరసింహారావు, నాలి రామయ్య, బత్తుల శ్రీనివాసరావు, జె.కొండలు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, శాంత రమేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించండి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

నరసరావుపేట: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఖాజామొహిద్దీన్, సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథబాబు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాజామొహిద్దీన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు శాఖలో 25 ఏళ్ల పాటు ప్రకాశం జిల్లాలో సీఐగా బాధ్యతలు నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజు సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై ఒంగోలు ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేశారు. పదోన్నతిపై నరసరావుపేటకు సూపరింటెండెంట్‌గా వచ్చారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించి ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ్ బాబు అన్నారు. డీఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఎస్పీగా పని చేసిన బి.ఆదినారాయణ తూర్పుగోదావరి దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా సోమవారం రిలీవ్ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న గురునాథ్ బాబు 1991 బ్యాచ్ ఎస్ఐగా అనంతపురం జిల్లాలో విధుల్లో చేరారు. 2005లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది రైల్వేలో పని చేశారు. 2014లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం రాజమండ్రి నేర విభాగంలో పనిచేస్తూ సత్తెనపల్లి డీఎస్పీగా నియమితులయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు. డీఎస్పీని పట్టణ సీఐ పి.ప్రభాకర్, సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు, అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పైడి రాంబాబు, పి.హజరత్తయ్య మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు రైళ్లు రద్దు

డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రబాద్ డివిజన్‌లోని మౌలాలి-అమ్ముగూడ-సనత్‌నగర్ మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా గుంటూరు డివిజన్ నుంచి అటుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ సోమవారం తెలిపారు. గుంటూరు-సికింద్రబాద్(12705), సికింద్రబాద్-గుంటూరు(12706), గుంటూరు-వికారబాద్(12747), వికారబాద్-గుంటూరు(12748), రేపల్లె-సికింద్రబాద్(17646), సికింద్రబాద్-రేపల్లె(17645) రైళ్లు సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. నడికుడి-మిరియాలగూడ(07973), మిరియాలగూడ-కాచిగూడ(07974), కాచిగూడ-రేపల్లె(17625), రేపల్లె-సికింద్రబాద్(17626) రైళ్లు గత ఆదివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, కాచిగూడ-మిరియాలగూడ(07276), మిరియాలగూడ-నడికుడి(07277) రైళ్లు గత శనివారం నుంచి ఈ నెల 9వ తేది వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే గుంటూరు-సికింద్రబాద్(17201) రైలు ఖాజీపేట-సికింద్రాబాద్ మీదుగా సోమవారం నుంచి ఈ నెల 11వ తేది వరకు, సికింద్రబాద్-గుంటూరు(17202) రైలు సికింద్రబాద్-ఖాజీపేట మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు చెప్పారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

గుంటూరు జేసీ రాజకుమారి ఆదేశం

గుంటూరు వెస్ట్: మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఏడాది పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం అధికారుల సమావేశం నిర్వహించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 మధ్యాహ్నం వరకు 2 నుంచి 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. వీటికి 24,334 మంది హాజరు కానున్నారని, 113 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 2,042 మంది హాజరవుతారని, 11 కేంద్రాల్లో ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు మూడు దఫాల్లో నిర్వహిస్తామని వివరించారు. వేసవి ప్రారంభం దృష్ట్యా కేంద్రాల్లో విద్యార్థులు తాగునీటి సదుపాయంతో పాటు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ వద్దని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో వాల్ క్లాక్స్‌తోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆర్ఐఓ జేకే జుబేర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, రవీంద్రరావు పాల్గొన్నారు.

9నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు 4,72,534 మందిని గుర్తించామని వెల్లడించారు. వీరందరికీ ఆల్బెండాజోల్ మాత్రలను ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ మింగించాలని ఆదేశించారు. చిన్నారులు, బాలల ఆరోగ్యం కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నులిపురుగులను నియంత్రిస్తే చాలా రోగాల్ని అరికట్టవచ్చని చెప్పారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నులిపురుగుల నివారణ ఆవశ్యకతను వివరించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్రను నీళ్లల్లో కలిపి తాగించాలని, 2-19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర వేయాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, రవీంద్రరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

చీరాల ఆర్పీఎఫ్ పోస్ట్ కమాండర్ సీఐ



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు

చీరాల రూరల్: మానవ అక్రమ రవాణాకు పాల్పడినా, కార్మికులను వెట్టిచాకిరీ చేయించి బానిసలుగా మార్చినా చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్పీఎఫ్ పోస్ట్ కమాండర్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. షాడోస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సంస్థ చైర్మన్ రాజా సాల్మన్ రైల్వే స్టేషన్‌లో 'బాండెండ్ లేబర్ హ్యూమన్ ట్రాఫికింగ్' గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ ఆవరణలో బాండెడ్ లేబర్, హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి అనుమానాస్పదంగా ఉన్నవారిని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాలలో పరిశ్రమలు, వస్త్ర దుకాణాలు ఎక్కువగా ఉన్నందున చీరాలకు అనేక వేలమంది ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అంతేకాక పనుల కోసం కూడా చీరాలకు వస్తుంటారని చెప్పారు. అటువంటి వారిపై ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినా, వారిని బానిసలుగా మార్చి వెట్టిచాకిరీ చేయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైళ్లలో, రైల్వే స్టేషన్‌లో కానీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో షాడోస్ సంస్థ చైర్మన్ రాజా సాల్మన్ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో రూ.3 లక్షలు కాజేశారు..

జగనన్నకు చెబుదాంలో జిల్లా అడ్మిన్ ఎస్పీకి ఫిర్యాదు



స్పందనలో అడ్మిన్ ఎస్పీకి సమస్య విన్నవిస్తున్న మహిళ

నరసరావుపేట: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించడంతో స్పందనలో అర్జీ అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జగనన్నకి చెబుదాం కార్యక్రమాన్ని సోమవారం జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధతో నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలకు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నా కుమారుడికి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించడం లేదు. తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. అతడిపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించండి.

–ఓ మహిళ, చిలకలూరిపేట

రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ...

రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నా వద్ద నుంచి ఒక వ్యక్తి తీసుకున్నాడు. ఆ వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకుండా, ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. నా డబ్బులు నాకు ఇప్పించి న్యాయం చేయండి.

–సాతులూరి అజయ్, జానపాడు, పిడుగురాళ్ల మండలం

నా స్థలం ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నారు

గ్రామంలో నాకు 52 సెంట్లు స్థలం ఉంది. ఆ స్థలానికి పక్కన ఉన్న వ్యక్తి నా స్థలంలోని ఏడు సెంట్లు ఆక్రమించుకున్నాడు. అదేమంటే నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటున్నాడు. అతడి వద్ద నుంచి నా స్థలం విడిపించి నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, బయ్యవరం, క్రోసూరు మండలం

నన్ను, నా భర్తను ఏడిపిస్తున్నారు

నేను కులాంతర వివాహం చేసుకున్నా. పల్లెలో నివాసం ఉంటుండగా సమీపంలోని పవన్ అనే వ్యక్తి తన అనుచరులతో మా ఆటోలో కూర్చున్నాడు. అలా కూర్చోవద్దు అని చెప్పడంతో నన్ను, నా భర్తపై దాడిచేశాడు. ఇంట్లో నుంచి బజారుకు రావాలంటనే భయంగా ఉంటుంది. ఈ విషయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. నాకు, నా భర్తకు రక్షణ కల్పించండి.

–ప్రవల్లిక, చిలకలూరిపేట

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- లంక భూముల పట్టాలు పంపిణీ



మల్లాది లంకభూముల పట్టాలను రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీలో 95 మంది పేద రైతులకు 38 ఎకరాల లంకభూములకు చెందిన పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు నచ్చిన వారికే భూములను ఇచ్చి మళ్లీ లాక్కునేవి, కానీ సీఎం జగనన్న పేదలు బాగుండాలని వారి పేరున పట్టాలు అందజేస్తున్నారని చెప్పారు. పేదలకు సాయం అందించటం కోసం చట్టాలలో కూడా మార్పులు చేశారని వివరించారు. ఈ పట్టాల వలన పేదలకు వ్యవసాయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు, బ్యాంకు రుణాలు తీసుకోవడానికి కూడా వీలు కలుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు పేదలకు మాయమాటలు చెప్పి కాలం వెళ్లతీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి చేసిందన్నారు. నియోజకవర్గంలో ఆస్పత్రులు, పాఠశాలలు, నాడు- నేడు ద్వారా రూపురేఖలు మార్చామన్నారు. తాను చేసిన దాంట్లో గత ప్రభుత్వాలు కనీసం పది శాతమైనా చేశాయా అని ఆయన ప్రశ్నించారు. పేదలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్‌లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయటానికి తనవంతు నిరంతర కృషి జరుగుతూనే ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ మురళీకృష్ణ, ఎంపీపీ మేకల హనుమంతరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, తహసీల్దార్ వెంకటరమణారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వెంపా వాసు పాల్గొన్నారు.

మునగోడులో రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మండల పరిధిలోని మునగోడులో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బంకా విష్ణు, మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు సాయిభాస్కర్‌లో రోబోటిక్ సర్జరీలు

విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేంద్రరెడ్డి



రోబోటిక్‌తో కీళ్ల ఆపరేషన్ చేసే విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అన్ని విభాగాల్లో అందుబాటులోకి వచ్చిందని గుంటూరు సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లలో రెండు నుంచి మూడు శాతం ఫెయిల్యూర్స్ ఉంటాయని, అవి కూడా లేకుండా నూటికి నూరు శాతం మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేయడంలో రోబోటిక్ ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. తమ హాస్పిటల్‌లో 150 మందికి పైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు విజయవంతంగా చేశామని చెప్పారు. ఏపీలోనే మొట్టమొదటిసారిగా ఫుల్లీ ఆటోమ్యాటిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు తమ ఆసుపత్రిలో చేస్తున్నామని తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా పరికరాల వినియోగం చాలాతక్కువగా ఉంటుందని, తద్వారా ఇన్‌ఫెక్షన్ సోకదని పేర్కొన్నారు. రక్తం పోవడం చాలా తక్కువగా ఉంటుందని, నొప్పి ఉండదని, త్వరగా రోగి కోలుకుంటాడని, జాయింట్ల కాలపరిమితి కూడా ఎక్కువ కాలం ఉంటుందని వివరించారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన 63 సంవత్సరాల గుప్తా సుబ్బారావుకు 16 ఏళ్లుగా మోకీళ్ల సమస్య ఉండి, ఎడమ కాలు పూర్తిగా వంగిపోయిందన్నారు. గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన 72 సంవత్సరాల జ్ఞానసుందరికి కుడికాలు తీవ్రమైన నొప్పి ఉండటంతో వీరిద్దరికి నవంబరు 2న రోబోటిక్ సాయంతో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



పరీక్షల కోసం వచ్చిన వారితో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కొనియాడారు. మండలంలోని నంబూరులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు రెండో రోజు సోమవారం ముగిశాయి. నేత్ర, గుండె పరీక్షలను 1,210 మంది వినియోగించుకున్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపి సేవల్ని కూడా అందజేశారు. గుండె పరీక్షల అనంతరం వైద్యులు 18 మందికి యాంజియోగ్రామ్ అవసరమని సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలతో పేదరికం నిర్మూలిస్తున్న నిజమైన ప్రజా యోధుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాల్ని అందివ్వడాన్ని పవిత్ర కార్యంగా భావిస్తూ ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ అంకితభావంతో ప్రజా సేవను కొనసాగిస్తుందని వివరించారు. ఏడాది నుంచి బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో కంటి సమస్యల నివారణకు నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజీయోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తున్నట్టు వివరించారు.